క్లుప్తంగా

ఎంపీ వినోద్‌ను కలిసిన శివయాదవ్



చార్మినార్: రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ యాకుత్‌పురా యూత్ ప్రెసిడెంట్ శివయాదవ్, నేషనల్ హ్యుమెన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు రవి, హ్యుమెన్ రైట్స్ కౌన్సిల్ మహిళా అధ్యక్షురాలు స్వప్న, సభ్యులు నవీన్ కుమార్, కిరణ్ కుమార్, గణేష్, విజయ్ భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

ముగిసిన రంగనాథస్వామి ఆలయ ఉత్సవాలు



ఆలయం వద్ద అమర్ సింగ్

గోల్కొండ: నానల్‌నగర్ సాలార్జంగ్ కాలనీలోని శ్రీ కోవెల రంగనాయకస్వామి ఆలయ సంక్రాంతి జాతర 3 రోజుల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. కరోనా తర్వాత ఇంత పెద్దెత్తున ఉత్సవాలు జరగడం స్వామి వారిపై భక్తులకు నమ్మకానికి నిదర్శమన్నారు. కాగా బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్. జనార్దన్, శ్రీకాంత్, నర్సింహా తదితరులున్నారు.

హజ్రత్ బీబీ ఫాతిమా జెహ్రా జయంతి



చార్మినార్: హజ్రత్ మహ్మద్ ప్రవక్త కూతురు హజ్రత్ బీబీ ఫాతిమా జెహ్రా జయంతిని పురస్కరించుకొని మీరాలంమండిలోని హుస్సేనీ నవాబ్ ఇనాయత్ జంగ్ బహదూర్‌లో జషన్–ఎ–అబ్లేట్ (ఎ.ఎస్) కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజ్జత్–ఉల్–ఇస్లాం మౌలానా సయ్యద్ లుక్మాన్ హుస్సేన్ మూస్వీ, మౌలానా సయ్యద్ హైదర్ జైదీతో పాటు బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాఖ్రీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తరలింపు అక్రమం

గోల్కొండ: భారత రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానం దేశానికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని దళిత సంఘాల అధ్యక్షుడు ఎస్. రాజు వస్తాద్ అన్నారు. గతంలో పంజగుట్ట చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని జై భీమ్ కార్యకర్తలు ఏర్పాటు చేశారని, అయితే ఆ విగ్రహాన్ని తొలగించడం జరిగిందన్నారు. ఈ విషయంపై తాము సుదీర్ఘ కాలం ఆందోళనలు చేశామన్నారు. ఫలితంగా మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హన్మంతరావు డాక్టర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని పంజగుట్ట చౌరస్తా వద్ద ప్రతిష్ఠించడానికి నిర్ణయించారన్నారు. అయితే పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందుల కారణాలు చెబుతూ దానిని అడ్డుకున్నారన్నారు. ఈ విగ్రహం పునః ప్రతిష్ఠాపన చేయడానికి నేడు దళిత ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలను, దళిత సంఘాలతో పాటు బీసీ, ఎస్టీ సంఘాలు రావాలని ఆయన అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10.30 గంటలకు సహృదయులైన వారు తమ సలహాలు ఇవ్వడానికి రావాలని ఆయన కోరారు.

'కోట' కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. పాఠశాలలు, కళాశాలలకు సెలవు కావడంతో విద్యార్థులు భారీ ఎత్తున కోటకు తరలివచ్చారు. ఇదిలా ఉండగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కోటలోని అన్ని ప్రాంతాల్లో విద్యార్థులు సందడి చేశారు. వారికి గోల్కొండ హిస్టరీ ఒక్కొక్క కట్టడం విశేషాలు వివరించారు. భారీ రాళ్లతో నిర్మించిన భక్తరామదాసు చెరసాలను చూసి విద్యార్థులు ఆశ్చర్యపోయారు. మరోవైపు కుటుంబాలతో వచ్చిన వారు కోటలోని నగీనాబాగ్ కొత్త రూపును సంతరించుకున్నారు. కోటలోని రాణీ మహాల్, క్లాపింగ్ పోర్టికో వద్ద యువజంటలు సెల్ఫీలు తీసుకుంటూ సంబురపడ్డారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే కౌసర్



కంటి వెలుగు కరపత్రం. బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత కంటి వెలుగు అధికారులదేనని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయం వద్ద ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కంటి వెలుగు బ్యానర్, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వార్డు బాయ్ స్థాయి నుంచి వైద్యుల వరకు ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి ఈ కార్యక్రమం గురించి వివరించాలని సూచించారు.

కార్యక్రమానికి సరైన ప్రచారం లేకపోతే అది విజయం కాదాని ఆయన అన్నారు. వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు కలిసికట్టుగా వాడవాడలా తిరిగి కంటి వెలుగు కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రహసనంగా ముగించకుండా ప్రజలకు ప్రయోజనం కలిగించేలా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా శస్త్ర చికిత్సలు అవసరం అయిన వారిని గుర్తించి వారికి సరైన సలహాలు, సూచనలు ఇచ్చి ప్రభుత్వం గుర్తించిన కంటి ఆస్పత్రులకు పంపాలన్నారు. కంటి అద్దాల విషయంలో ఏ మాత్రం ఆలస్యం వద్దని డాక్టర్లు సూచించిన అద్దాలనే ఇవ్వాలన్నారు. క్యాంపు జరిగినన్ని రోజులు సిబ్బంది ఎంతో నిష్టగా తమ విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనురాధతో పాటు మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, సయ్యద్ రఫత్ హుస్సేన్, బస్తీ దవాఖానాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మల్లన్న జాతర

జియాగూడ: జియాగూడలోని చారిత్రాత్మకమైన జియాగూడ మల్లన్న ఆలయంలో జాతర వేడుకలు మిన్నంటాయి. వారం రోజుల నుంచి మల్లన్న జాతర నిరవధికంగా కొనసాగుతుంది. పెద్ద ఎత్తున పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని మల్లన్న, భ్రమరాంబదేవి, గొల్ల కేతమ్మలను దర్శించుకుని తరించారు. సోమవారం జాతర వేడుకల్లో భాగంగా మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం, సదరు పటం, అగ్గిగుండాలు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పూజారి బండ్దారి నారాయణగారి మల్లేశం మాట్లాడుతూ.. శతాబ్దాల నుంచి మల్లన్న వేడుకలను భక్తిపూర్వకంగా నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



పూజలందుకున్న జియాగూడ మల్లన్న



జాతరలో భక్త జన సందోహం

వైభవంగా ధనుర్మాస వేడుకలు



జీలకర్ర బెల్లం చూపుతున్న రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: ధనుర్మాస వేడుకలు లంగర్‌హౌస్ త్రివేణి సంగంలో వైభవంగా ముగిశాయి. చారిత్రాత్మక మఠ ఆలయం జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథ స్వామిల వివాహం కనుల పండువగా నిర్వహించారు. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో భారీ వేదికపై గోదారంగనాథులను రంగురంగుల పూలతో ఆసీనులను చేసి వేదపండితుల సమక్షంలో గోదా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీనియర్ జర్నలిస్టు జావేద్ మృతి



మహ్మద్ జావేద్ (ఫైల్)

చాంద్రాయణగుట్ట: పాతబస్తీకి చెందిన ఓ దినపత్రిక సీనియర్ జర్నలిస్టు మహ్మద్ జావేద్ (40) ఆదివారం సాయంత్రం అకాల మరణం పొందారు. జంగమ్మెట్‌కు చెందిన జావేద్ ఆదివారం సాయంత్రం ఇంజన్ బౌలిలో ఓ కార్యక్రమం కవరేజీకు వెళ్లారు. ఆ సమయంలోనే ఫిట్స్ రావడంతో కుప్పకూలిన ఆయనను చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్రా ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఖాద్రీ చమాన్ శ్మశాన వాటికలో రాత్రి ఆయన అంత్యక్రియలు ముగిశాయి. ఆయనకు భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నందకిశోర్ వ్యాస్

అబిడ్స్: క్రీడా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సిక్వాల్ బ్రహ్మణ్ యువ సమితి ఎస్.పీ.ఎల్– 2023 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా విశేషంగా కృషి చేస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. సిక్వాల్ సమితి క్రీడాకారులతో పాటు గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా క్రీడాకారుల సంక్షేమానికి నిరంతర తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చేతన్ తివారి, కైలాష్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని రెయిన్‌బజార్ డివిజన్‌లో చేపట్టనున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులకు ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీ వుద్దీన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాతబస్తీ అభివృద్ధికి తమ పార్టీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. నియోజకవర్గంలో డ్రైనేజీ, తాగునీటి, నాలాల విస్తరణ, రోడ్ల విస్తరణ, కమ్యూనిహాల్ నిర్మాణ పనులను చేపట్టానున్నామన్నారు. బస్తీల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, మీర్ షోయబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాతో పక్షికి గాయం



జియాగూడ: చైనా మాంజాతో ఓ పక్షికి గాయం కాగా దానికి వెంటనే ప్రథమ చికిత్స చేసి ఫారెస్ట్ అధికారికి అందజేసిన ఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం సంక్రాంతి రోజున ఆకాశంలో ఎగురుతున్న ఓ పక్షికి చైనా మాంజా చుట్టుకుంది. దీంతో విలవిలలాడుతూ సబ్జిమండి గ్రేవియార్డులో పడింది. గమనించిన స్థానికుడు అంజాద్ పోలీసులకు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పక్షికి ప్రథమ చికిత్స చేసి ఫారెస్ట్ అధికారి గణేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారి గణేష్ మాట్లాడుతూ.. చైనా మాంజాతో పక్షులకు ప్రాణాపాయం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

గో సంరక్షణకు కృషి



హరిదాసులకు ధాన్య సమర్పణలో పాల్గొన్న కోటి శ్రీధర్ తదితరులు

అబిడ్స్: నగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర నలుమూలలా గోవుల సంరక్షణకు, గో ఉత్పత్తులకు విశేషంగా కృషి చేస్తున్నట్లు టీటీడీ గో సంరక్షణదళ్ తెలంగాణ రాష్ట్ర సభ్యుడు కోటి శ్రీధర్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లో గో ఉత్పత్తులను పెంపొందిస్తూ నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం తిరుపతిలోని ఎస్.వి.గోశాలలో జరిగిన గో పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటి శ్రీధర్ మాట్లాడుతూ.. నగరంలో నిరంతరం గో సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి

సంక్రాంతి పండగను చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేశారు. ప్రజా ప్రతినిధులు, వయస్సు భేదం లేకుండా మిద్దెలపై డీజే పాటలతో గాలి పటాలు ఎగరవేస్తూ సందడి చేశారు. – చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



గోషామహల్‌లో బీఆర్ఎస్ నేతలు



గోల్కొండలో..

గౌలిపురా శివనాగ లింగేశ్వర వీధిలో..



మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు



నాంపల్లి: మానసిక ఆరోగ్యం మనిషి జీవితంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీఎస్ఏ ఆధ్వర్యంలో ముస్లిం ఎడ్యుకేషనల్ సోషల్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్, మెస్కో ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త నిర్వహణలో సోమవారం మానసిక ఆరోగ్యంపై ముస్తయిద్‌పురాలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా మహమ్మద్ అబ్దుల్ వహాబ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని అన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు మెస్కో సంస్థ అనేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం అబ్దుల్ వహాబ్‌కు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎంసీఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సలేహా ఫిర్దోస్, ప్రొఫెసర్ మహ్మద్ యూసుఫ్, సీఎస్ఏ చీఫ్ కౌన్సిలర్ బషీర్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



అబిడ్స్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తలసానికి పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

నుమాయిష్‌లో సందర్శకుల సందడి



నుమాయిష్‌కు పెద్ద ఎత్తున హాజరైన సందర్శకులు



యాప్‌ను ప్రారంభిస్తున్న అశ్విన్ మార్గం తదితరులు

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 82వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) సందర్శకులతో కిటకిటలాడుతుంది. సంక్రాంతి సెలవులు రావడంతో ఈ మూడు రోజుల్లో దాదాపు 2.70 లక్షలకు పైగా సందర్శకులు నుమాయిష్‌ను తిలకించారు. సోమవారం ఎగ్జిబిషన్‌ను 90 వేల మంది సందర్శించినట్లు నుమాయిష్ బుకింగ్ కమిటీ చైర్మన్ హన్మంతు తెలిపారు. అదేవిధంగా ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు సందర్శకుల కోసం బహుళ భాషలతో కూడిన నుమాయిష్ యాప్‌ను ప్రారంభించారు. నుమాయిష్‌కు మార్గాన్ని కనుగొనడం, ఫన్‌జోన్ సౌకర్యాలు, దుకాణాల సమాచారం వినియోగదారులకు, వ్యాపారస్తులకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్విన్‌మార్గం, కార్యదర్శి సాయినాథ్ దయాకర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సర్వ సౌభాగ్యదేవి త్రయ గీతాజ్ఞాన యజ్ఞం



మాట్లాడుతున్న బ్రహ్మర్షి మురుకుంట్ల రాజేశ్వర శర్మ తదితరులు

సుల్తాన్‌బజార్: లోక కల్యాణార్థం జనవరి 18, 19, 20వ తేదీల్లో కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన 1896వ శ్రీ సర్వ సౌభాగ్య త్రయ గీతాజ్ఞాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్రహ్మర్షి శ్రీ మురుకుంట్ల రాజేశ్వర శర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం హైదర్‌గూడ ఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ధర్మకర్త మొగుళ్లపల్లి ఉపేందర్, స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, సురిశెట్టి శ్రీనివాస్‌గుప్తాతో కలిసి ఆయన మాట్లాడుతూ.. మానవాళి సుఖశాంతి సౌభాగ్యము, ఆయురారోగ్య ఐశ్వర్యములను, లోకోద్ధరణను కాంక్షించి ఈ యజ్ఞ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీలు పోతుగంటి రాములు, గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ సలహాదారు సముద్రాల వేణుగోపాలచారి హాజరవుతారని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న గొంటి కుమార్ చౌదరియాదవ్

సుల్తాన్‌బజార్: ఏపీలో బీసీ సీఎం ప్రధాన అజెండాతో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజ్యాధికారమే లక్ష్యంగా త్వరలో బలమైన రాజకీయ పార్టీల ఫ్రంట్ ఏర్పాటు చేయనున్నట్లు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు గొంటి కుమార్ చౌదరి యాదవ్ అన్నారు. తెలంగాణలో త్వరలో రానున్నన ఎన్నికల్లో 119 అసెంబ్లీ స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపుతామని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం పలు జాతీయ పార్టీల నేతలతో కలిసి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అగ్రస్థానం లభించేలా 15 పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున కూటమి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 75 ఏళ్ల చరిత్రలో ఇప్పటివరకు బీసీ ముఖ్యమంత్రి కాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అసెంబ్లీకి పంపించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమావేశంలో నేషనల్ ఆధార్ పార్టీ అధ్యక్షుడు వీర శేషగిరిరావు, నేషనల్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, బహుజన్ రాజ్యం పార్టీ (పూలే అంబేడ్కర్) అధ్యక్షుడు లాలు నాయక్‌రామ్ రతన్, ఇండియా ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.బాబు, తులసి పార్టీ అధ్యక్షుడు శివ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న ట్రస్టు బోర్డు పాలక మండలి సభ్యులు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక శివగంగానగర్‌లోని అతి ప్రాచీనమైన శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయం నూతన ట్రస్టు బోర్డు పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారం ఆలయ సన్నిధిలో సోమవారం జరిగింది. మహేశ్, రమేశ్, రాజలింగం, స్వరూప నాయక్, శ్రీకాంత్‌ను ఆలయ ట్రస్టులుగా, ఆలయ అర్చకులు వెంకట శ్రీకాంత్‌ను ట్రస్టు బోర్డు ఎక్స్ అఫిసియో సభ్యులుగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీఎస్‌వీ సత్యనారాయణ సమక్షంలో శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్ కుమార్ ప్రమాణం స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఎన్నికైన రాజలింగంను ఆలయ చైర్మన్‌గా ఇన్‌స్పెక్టర్ సురేందర్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. బీఆర్ఎస్ పార్టీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాం రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. 300 ఏళ్లకు పైగా పురాతనమైన లింగాకారంలో నిర్మితమైన, దేశంలోనే అరుదైన ఈ అపురూప శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తించి ఈ ఆలయాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎండోమెంట్ శాఖ పరిధిలోకి తీసుకుందని చెప్పారు. ఆలయ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ లలితాబాగ్ డివిజన్ అధ్యక్షుడు జమ్మిచెట్టు రాజు, బీఆర్ఎస్ జంగమ్మెట్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

వెంటాడి గొంతు కోసేశారు..

- తమ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని దారుణ హత్య



లంగర్‌హౌస్: బావ మరదళ్లు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ వివాహం నచ్చని అమ్మాయి కుటుంబీకులు తమ అమ్మాయినే చంపి, వేధించి చంపారని ఆ నేరం ఆమె అత్త, భర్త, కుటుంబీకులపై నెట్టాలనుకున్నారు. విషయం తెలుసుకున్న భర్త మాట్లాడటానికి రావడంతో నడిరోడ్డుపై వెంటాడి గొంతు కోసి చంపిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. చెంగిచెర్లలో ఉంటూ రిలియన్స్ రిటైల్ స్టోర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కలీం, గోల్కొండ సబ్జా కాలనీలో నివాసముండే మరదలు ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను తిరస్కరించిన అమ్మాయి కుటుంబీకులు ఆమె మరో మేనత్త కుమారుడితో మార్చిలో వివాహం చేయడానికి నిశ్చయించారు. వివాహ కొనుగోళ్ల కోసం పెళ్లికి 4 రోజుల ముందు కుటుంబసభ్యులందరూ షాపింగ్ వెళ్లగా కలీం ఆమెను ముంబై తీసుకెళ్లి వివాహం చేసుకుని నెల తర్వాత నగరానికి వచ్చారు. ఈ క్రమంలో కలీం కుటుంబసభ్యులను అమ్మాయి తరపున బంధువులు పలుమార్లు వేధింపులకు గురి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలిక తండ్రి అహ్మద్‌తో పాటు ఇద్దరు కుమారులు, మరో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా జైలు నుంచి మేలో బయటకు వచ్చారు. కేసు విత్‌డ్రా చేసుకోవాలని కలీం ద్వారా అతని అన్న మామను అడగగా వారు ఒప్పుకోలేదు. కక్ష పెంచుకున్న అమ్మాయి కుటుంబీకులు కలిసి ఉందామని నటిస్తూ అబ్బాయి కుటుంబీకులతో కలిసి ఉన్నారు. 45 రోజుల క్రితం అమ్మాయిని గోల్కొండలోని తమ ఇంటికి తీసుకెళ్లారు. కలీంను వదిలేయాలని కుటుంబీకులతో పాటు గతంలో ఆమెతో వివాహం నిశ్చయమైన వ్యక్తితో వేధిస్తున్నారు. వారం క్రితం అమ్మాయిని భర్త వద్దకు పంపి అక్కడే ఆమెను హత్య చేసి అత్తింటిపై నెట్టి హత్య చేశారని చెప్పి జైలుకు పంపాలనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కలీం భార్య వేరొకరి ఫోన్‌తో ఈ విషయాన్ని భర్తకు వాయిస్ మెస్సేజ్ ద్వారా తెలియజేసింది. ఐదు రోజుల క్రితం గోల్కొండ పోలీసులను సంప్రదించగా వారిద్దరూ వేరు కాపురం పెడితే తాము ఒప్పుకుంటామని పోలీసుల ముందు అమ్మాయి కుటుంబీకులు చెప్పగా కలీం ఒప్పుకున్నాడు.

అద్దె గది చూపిస్తామని పిలిపించి..

తమ తల్లికి సర్జరీ అయ్యిందని, ఆమె మేడిపల్లిలోని ఆస్పత్రిలో ఉందని ఆమె బయటకు రాగానే చెప్పి తాము వేరు కాపురం పెడతామని కలీం ఆ అమ్మాయి కుటుంబీకులకు చెప్పాడు. తమ ప్రాంతంలోనే గది చూసామని నచ్చితే వచ్చి చూసి వెళ్లాలని ఆదివారం రాత్రి గోల్కొండకు రావాలని ఫోన్ చేశారు. 10 గంటలకు ఎండిలైన్స్ చేరుకున్న కలీంతో గొడవపడి అందరు చూస్తుండగా రోడ్డుపై వెంటాడి ముగ్గురు వ్యక్తులు కలీం గొంతు కోసి హత్య చేశారు. హత్య చేసిన నిందితులు గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.